




sahanamvande.com
epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 06-08-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 121 EDITOR: ROHINI







# చిన్న టౌన్లలోనూ మల్టీప్లెక్స్ మ్యాజిక్

## పీవీఆర్ ఐనాక్స్ మాస్టర్ ప్లాన్

- మూడేళ్లలో 300 థియేటర్ల ఏర్పాటు
- 150 రూపాయలకే మల్టీప్లెక్స్ టికెట్
- ఫ్రాంచైజీలతో భారీ విస్తరణకు రంగం సిద్ధం
- సామాన్యుడికి ఆధునిక వెండితెర వినోదం




**మన దేశంలో సినిమా అనేది కేవలం ఒక వినోదం మాత్రమే కాదు, అది రోజువారీ జీవితంలో ఒక భాగం. కానీ చిన్న పట్టణాల్లో ఉండే వాళ్లకు పెద్ద మల్టీప్లెక్స్‌లలో సినిమా చూద్దామంటే జేబులు గుల్ల అయిపోవడం ఖాయం. అసలు సామాన్యుడికి అందుబాటు ధరలో వెండితెర మ్యాజిక్‌ను పరిచయం చేయడానికి ఇప్పుడు మన దేశపు అతిపెద్ద సినిమా దిగ్గజం ఒక అద్భుతమైన మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వచ్చింది.**

**- సహనం వందే, హైదరాబాద్**

మన దేశంలో మల్టీప్లెక్స్ అనగానే ఖరీదైన సోఫాలు, వందల రూపాయల టికెట్లు, పీజా బర్గర్లు గుర్తుకు వస్తాయి. పెద్ద నగరాల్లో ఉన్న వాళ్లకి ఇదంతా రోజూ చూసేదే కానీ చిన్న టౌన్లలో ఉన్న వాళ్ళకి ఇది ఒక కలలాంటిదే. ఈ అంతరాన్ని చెరిపేయడానికి ఇప్పుడు పీవీఆర్ ఐనాక్స్ సంస్థ ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. చిన్న పట్టణాల్లో ఉండే సినీ ప్రియులను టార్గెట్ చేస్తూ స్మార్ట్ సినిమా పేరుతో సరికొత్త థియేటర్లను ప్రారంభించ బోతున్నారు.

### తక్కువ ధరలో లగ్జరీ అనుభవం...

ఈ సరికొత్త స్మార్ట్ సినిమా హాళ్లలో టికెట్ ధరను చాలా తక్కువగా అంటే కేవలం 150 రూపాయల లోపే ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సామాన్యుడు కూడా తన కుటుంబంతో కలిసి ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సినిమా చూసేలా ఈ రేట్లను సెట్ చేశారు. చిన్న టౌన్లలో నివసించే యువత, మధ్యతరగతి ప్రజలు ఈ వినోదాన్ని సులభంగా ఆస్వాదించవచ్చు. ఇంత తక్కువ ధరకు సినిమా చూపిస్తూనే ప్రేక్షకుడికి ఎక్కడా తగ్గని సరికొత్త విజువల్, ఆడియో అనుభవాన్ని అందించడమే వీరి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

### ఫ్రాంచైజీ భాగస్వాముల ద్వారా విస్తరణ

ఈ భారీ ప్రాజెక్టును కేవలం ఒక్కరితోనే కాకుండా ఫ్రాంచైజీల ద్వారా విజయవంతం చేయాలని కంపెనీ చూస్తోంది. అంటే స్థానిక వ్యాపారవేత్తలు లేదా ఆసక్తి ఉన్న భాగస్వాములు ఈ థియేటర్లను సొంతంగా నిర్మించుకుంటే, వాటిని నడిపించే బాధ్యత మాత్రం ఈ సినిమా దిగ్గజం తీసుకుంటుంది. ఈ బిజినెస్ మోడల్ ద్వారా పెట్టుబడి భారం తగ్గుతుంది. దేశవ్యాప్తంగా మూలమూలకూ వ్యాపార విస్తరణ వేగంగా జరుగుతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రాంతాలను కవర్ చేయడానికి ఇదొక అద్భుతమైన మార్గంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### మూడేళ్లలో 300 కొత్త హాళ్లు

రాబోయే 3 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా ఏకంగా 300 స్మార్ట్ సినిమా హాళ్లను తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. ఇప్పటివరకు పెద్దగా సినిమా థియేటర్ల సౌకర్యం లేని లేదా నాణ్యమైన వినోదం దొరకని ప్రాంతాలను ఇవి టార్గెట్ చేస్తున్నాయి. ఈ ప్రణాళిక కనుక విజయవంతమైతే దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటివరకు పైరేటెడ్ ప్రింట్లు లేదా టీవీలకే పరిమితమైన చిన్న టౌన్ ఆడియెన్స్ ఇకపై నేరుగా వెండితెర మ్యాజిక్‌ను థియేటర్లలో ఆస్వాదించవచ్చు.

### స్థానికంగా ఉపాధి అవకాశాలు

ఈ ప్రాజెక్ట్ కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా స్థానికంగా ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుంది. థియేటర్ నిర్వహణ, టికెటింగ్, ఫుడ్ కోర్టులు, భద్రతా విభాగాలలో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయి. ఒక చిన్న పట్టణంలో ఇలాంటి ఆధునిక థియేటర్ వెలసిందంటే ఆ చుట్టుపక్కల ప్రాంతం మొత్తం వ్యాపారపరంగా కూడా అభివృద్ధి చెందుతుంది. వినోద రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థకు కూడా చిన్న టౌన్లలో ఊతం లభిస్తుందని చెప్పవచ్చు.




### కొత్త శకానికి నాంది

రాబోయే రోజుల్లో దేశంలోని ప్రతి చిన్న పట్టణంలోనూ వెండితెర కాంతులు మరింత ప్రకాశవంతంగా వెలగబోతున్నాయి. నగరాల నుంచి పల్లెల వైపు అడుగులు వేస్తున్న ఈ వ్యాపార వ్యూహం ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది కాలమే సమాధానం చెప్పాలి. ఏదేమైనా ప్రేక్షకుడికి తక్కువ ఖర్చుతో ఎక్కువ వినోదం దొరుకుతుందంటే అది ఎప్పుడూ స్వాగతించదగిన విషయమే. ఈ పరిణామాలు మన దేశ చిత్ర పరిశ్రమ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయబోతున్నాయి.

# రోజంతా రోడ్లపైనేనా?

## ట్రాఫిక్ నగరాల్లో బెంగళూరు టాప్

- నాలుగో స్థానంలో నిలిచిన హైదరాబాద్
- 10 కిలోమీటర్లు వెళ్ళడానికి 32:37 నిమిషాలు
- అత్యంత మెరుగైన తక్కువ ట్రాఫిక్ నగరం ఢిల్లీ

**దేశంలోని ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ నరకం ఏ స్థాయిలో ఉందో తాజా నివేదిక బట్టబయలు చేసింది. కేవలం 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. రద్దీ వేళల్లో ట్రాఫిక్‌లో చిక్కుకుని ఏటా వందల గంటలు వృథా అవుతున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - సహనం వందే, హైదరాబాద్**

దేశంలోనే అత్యంత ట్రాఫిక్ నగరంగా బెంగళూరు మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్లు వెళ్లడానికి 36:09 నిమిషాలు పడుతోంది. గతేడాదితో పోలిస్తే 2 నిమిషాలు సమయం పెరిగింది. రద్దీ వేళల్లో గడిపే ఈ ప్రయాణాల వల్ల ఏడాదిలో 168 గంటల సమయం వృథా అవుతోంది. ఉద్యోగులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.




### కోల్‌కతాలో తీవ్ర ఇబ్బందులు

కోల్‌కతా నగరం ఈ ట్రాఫిక్ జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 35:18 నిమిషాల సమయం పడుతుంది. గతేడాదితో పోలిస్తే 25 సెకండ్లు అదనంగా పెరుగుదల నమోదయింది. రద్దీ వేళల్లో నగరవాసులు ఏడాదిలో 150 గంటల పాటు కేవలం రోడ్లపైనే గడపాల్సి వస్తోంది. ఇరుకైన రోడ్లు సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

### పూణే, హైదరాబాద్ స్థితి

పూణే నగరం ట్రాఫిక్ ఇబ్బందుల్లో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 33:20 నిమిషాలు పడుతోంది. గత సంవత్సరంతో పోలిస్తే 11 సెకండ్లు పెరిగింది. ఏడాదికి 152 గంటలు వృథా అవుతున్నాయి. ఇక హైదరాబాద్‌లో 10 కిలోమీటర్ల ప్రయాణానికి 32:37 నిమిషాలు పడుతోంది. ఇక్కడ కూడా 11 సెకండ్లు పెరిగింది. ఏడాదికి 123 గంటల సమయం వృథా అవుతోంది. హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది.

### చెన్నై, ఎర్నాకులం తీరు

చెన్నై నగరంలో 10 కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే 31:15 నిమిషాలు పడుతుంది. గతేడాదితో పోలిస్తే 1 నిమిషం ప్రయాణ సమయం పెరిగిపోయింది. ఏడాదికి 132 గంటల సమయాన్ని కోల్పోతున్నారు. ఇక ఎర్నాకులం నగరంలో 29:51 నిమిషాలు పడుతుండగా, ఏడాదిలో 118 గంటలు వృథా అవుతున్నాయి. చిన్న నగరాల్లో కూడా ఈ రకమైన రద్దీ పెరగడం ఆశ్చర్యకరంగా ఉంది.

### జైపూర్, అహ్మదాబాద్ తీరు

జైపూర్‌లో 10 కిలోమీటర్ల ప్రయాణానికి 29:16 నిమిషాలు పడుతుండగా, 42 సెకండ్లు అదనంగా పెరిగింది. అహ్మదాబాద్‌లో 28:59 నిమిషాలు పడుతుండగా, ఇక్కడ మాత్రం 17 సెకండ్లు తగ్గింది. ముంబై నగరంలో 10 కిలోమీటర్లకు 28:51 నిమిషాలు పడుతుండగా, ఏడాదికి 126 గంటలు వృథా అవుతున్నాయి. ఆర్థిక రాజధానిలో ట్రాఫిక్ కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ జనం పాట్లు తప్పడం లేదు.

### మెరుగ్గా ఢిల్లీ పరిస్థితి

దేశ రాజధాని న్యూఢిల్లీ విషయానికి వస్తే... మిగతా నగరాలతో పోలిస్తే ఇక్కడ పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. ఢిల్లీలో 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 24 నిమిషాల సమయం మాత్రమే పడుతోంది. గతేడాదితో పోలిస్తే 28 సెకండ్లు పెరిగినప్పటికీ, మిగతా నగరాలతో పోలిస్తే ఇక్కడే ప్రయాణం వేగంగా సాగుతోంది. రద్దీ వేళల్లో ఏడాదికి 104 గంటల సమయం కోల్పోతున్నారు. మెరుగైన రహదారులు ఢిల్లీకి వెసులుబాటు కల్పిస్తున్నాయి.

# జార్ఖండ్‌కు బొద్దింకల దండు

## ఆ రాష్ట్రానికి కాక్రోచ్ పార్టీ నేత అభిజీత్ దీప్కే

- పరీక్షల అక్రమాలపై రగిలిపోతున్న జార్ఖండ్
- నిరుద్యోగ వ్యతిరేక పోరులో కాక్రోచ్ పార్టీ
- ఢిల్లీ దీక్ష ముగింపు తర్వాత కొత్త కార్యాచరణ
- దేశంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

**దేశవ్యాప్తంగా పరీక్షల పేపర్ లీకేజీలపై విద్యార్థులు ఆగ్రహంతో రగులుతున్న వేళ సరికొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వచ్చాయి. విద్యా వ్యవస్థ వైఫల్యాలను ఎలుగెత్తి చాటుతూ యువతను ఏకం చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు జార్ఖండ్ గడ్డపై అడుగుపెట్టడానికి సిద్ధమైంది. వ్యవస్థలను ప్రశ్నించే శక్తిగా మారుతున్న ఈ యువ ఉద్యమం సరికొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తోంది.**

**- సహనం వందే, మహారాష్ట్ర**



జార్ఖండ్‌లో ప్రభుత్వ నియామక పరీక్షల అక్రమాలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూట్‌మెంట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపై రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జూలై 29 నుంచి నిరుద్యోగ అభ్యర్థులు నిరవధిక దీక్షను ప్రారంభించారు. ఈ ఆందోళనకు మద్దతుగా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జార్ఖండ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర వెలుపల ఉన్న హైకోర్టు రిటైర్డ్ జడ్జీలతో కూడిన స్వతంత్ర కమిటీ చేత ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

### యువ ఉద్యమం ఒక ప్రెషర్ గ్రూప్

మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశానికి ముందు బుధవారం అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల పరిస్థితి చాలా క్షీణించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఉదయం ఒక వైపు ఓటేస్తే సాయంత్రానికి ఎవరో ఒకరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘంపై నమ్మకం సడలిపోయిందని స్పష్టం చేశారు. ఈ దేశానికి ఇప్పుడు రాజకీయ పార్టీల కంటే ఒక శక్తివంతమైన ప్రజా ఒత్తిడి బృందం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు.

### ఉద్యమంపై పోలీసుల ఉక్కుపాదం

దేశ రాజధానితో పాటు ముంబై, కోల్‌కతా మరియు బిహార్‌లో జరిగిన నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి నిర్బంధించారు. కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ స్పోక్స్‌పర్సన్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ, విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రతినిధులతో ఈ అంశంపై చర్చలు జరుపుతున్నామని, దేశవ్యాప్తంగా గాయపడిన ఆందోళనకారులకు చట్టపరమైన మరియు వైద్యపరమైన సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.

### సంస్థాగత విస్తరణకు రోడ్‌మ్యాప్

జంతర్ మంతర్ ఆందోళనకు ఊహించని విధంగా దేశవ్యాప్తంగా స్పందన రావడంతో పార్టీపై బాధ్యతలు మరింత పెరిగాయని నేతలు తెలిపారు. ఛత్రపతి సంభాజీనగర్‌లో ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ కోర్ కమిటీ సమావేశం రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సమావేశంలో సోనం వాంగ్‌చుక్‌ను తమ మార్గదర్శకుడిగా కొనసాగించాలని, ఆయన సలహాలు తీసుకోవాలని నిర్ణయించారు. సంస్థను మరింత విస్తరించడానికి భవిష్యత్తు రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నట్లు దీప్కే వెల్లడించారు.

### ప్రజా సమస్యలపై పోరాటం...

కేవలం విద్యా రంగానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని విస్తరించాలని కాక్రోచ్ జనతా పార్టీ భావిస్తోంది. ప్రస్తుత కోర్ కమిటీ సమావేశంలో మీడియా, న్యాయవ్యవస్థపై ప్రజలకు తగ్గుతున్న విశ్వాసం గురించి ప్రధానంగా చర్చిస్తున్నారు. అలాగే ఇథనాల్‌తో కలిపిన ఇంధనం, పెరుగుతున్న నిరుద్యోగం వంటి కీలక అంశాలను కూడా ఎజెండాలో చేర్చారు. ఈ సమావేశంలో అభిజీత్ దీప్కేతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, రత్న సింగ్ తదితరులు పాల్గొన్నారు.